కరెంట్ కష్టాలకు చెక్!

- దశాబ్దాల విద్యుత్ సమస్యకు చరమగీతం
- ఆర్‌కేపీలో రూ.1.90 కోట్లతో నూతనంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్



ఆర్‌కేపీలో ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణాన్ని కొన్ని దశాబ్దాలుగా పీడిస్తున్న కరెంట్ సమస్య ఎట్టకేలకు పరిష్కారం కానుంది. పట్టణ పరిధిలో 33/11 కేవీ సామర్థ్యం గల నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం మరికొన్ని రోజుల్లోనే ఆచరణలోకి వస్తున్న తరుణంలో విద్యుత్ సమస్యకు ఇక శాశ్వత పరిష్కారం లభించనుంది. ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ ప్రత్యేక చొరవతో కరెంట్ కష్టాలకు ఇక తెరపడనుంది.

ఏళ్ల అగచాట్లకు పరిష్కారం

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో దాదాపు 40 వేల జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలోనే గతంలో ఇది మేజర్ గ్రామ పంచాయతీ. పారిశ్రామిక ప్రాంతంగా కూడా సింగరేణిలోనే ఆర్‌కేపీకి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇంతటి పేరున్న ఈ ప్రాంతానికి ఒక్క సబ్‌స్టేషన్ కూడా లేకపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. గత పాలకులు, విద్యుత్ శాఖ అధికారులు ఈ ప్రాంతంపై పూర్తి నిర్లక్ష్యం కనబర్చడంతో నాణ్యమైన కరెంట్ అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎండాకాలంలో సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. పెద్ద సంఖ్యలో విద్యుత్ కనెక్షన్లు ఉన్నప్పటికీ సబ్‌స్టేషన్ లేకపోవడంతో మంచిర్యాల, మందమర్రి నుంచి విద్యుత్ సరఫరా జరుపుతూ వస్తున్నారు. ఇక్కడ దాదాపు 10,890 గృహ, వాణిజ్య వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కాగా, ఇన్ని కనెక్షన్లు ఉన్నా సబ్‌స్టేషన్ లేకపోవడంతో మంచిర్యాలలోని రాజీవ్‌నగర్, ఏసీసీ సబ్‌స్టేషన్లతోపాటు మందమర్రిలోని అందుగులపేట సబ్‌స్టేషన్ నుంచి పట్టణానికి గత కొంతకాలంగా విద్యుత్ సరఫరా జరిగుతోంది. ఏ చిన్న సమస్య ఎక్కడ తలెత్తినా తరచూ కరెంట్ కట్ అయ్యేది. దీంతో పట్టణమంతా అంధకారంలోకి వెళ్లేది. విద్యుత్ అంతరాయ సమస్యలే కాకుండా లోఓల్టేజీ సమస్య కూడా తీవ్రంగా ఉండేది. రామకృష్ణాపూర్‌లో గల వేలాది కనెక్షన్లకు రాజీవ్‌నగర్, అందుగులపేట సబ్‌స్టేషన్ల సామర్థ్యం కూడా సరిపోయేది కాదు. ఎట్టకేలకు చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఈ ప్రాంత విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని ప్రత్యేక చొరవ చూపించారు. రూ.కోటి 90 లక్షల నిధులు మంజూరు చేయించడంతోపాటు స్థానిక శివాజీనగర్‌లో సింగరేణి ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా రెవెన్యూశాఖకు అప్పగించడంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపారు. అనతికాలంలో అనుమతులు తెప్పించి అటు పనులు కూడా శరవేగంగా సాగేలా చర్యలు తీసుకున్న దరిమిలా ఆర్‌కేపీకి కరెంట్ వెలుగుల శోభ సంతరించుకుంటుందనే ధీమా పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతుంది.

మరికొద్దిరోజుల్లో అందుబాటులోకి..

రూ.కోటి 90 లక్షలతో గతేడాది జూలైలో ప్రారంభమైన సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఆర్‌కేపీలోపాటు క్యాతనపల్లి, గద్దెరాగిడి, అమరవాది ప్రాంతాల్లో నూతనంగా ఐదు ఫీడర్లను అలాగే ఇక్కడి నుంచి 6 కి.మీ మేరకు 11 కేవీ, 4 కి.మీ మేర 33 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటుచేశారు. పనులు దాదాపు పూర్తయిన నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో నూతన సబ్‌స్టేషన్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో రామకృష్ణాపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల విద్యుత్ కష్టాలు సైతం తీరనున్నాయి. దశాబ్దాల సమస్యకు కేవలం 15 నెలల వ్యవధిలో పరిష్కారం చూపిన ఎమ్మెల్యే బాల్కసుమన్‌ను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా శివముక్కోటి పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథదేవస్థానంలో శుక్రవారం శివముక్కోటి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు శివపార్వతులను ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. పూజలో ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు పాల్గొన్నారు. అర్చకులు నరహరిశర్మ, శ్రీకేశ్‌శర్మ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పనులు పూర్తి చేయించాలి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నరేందర్

చెన్నూర్‌రూరల్: పాఠశాలలో పనులు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను జెడ్పీ సీఈవో కె.నరేందర్ ఆదేశించారు. కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మనఊరు–మన బడిలో భాగంగా పైలట్ స్కూల్‌గా ఎంపికైన సుద్దాల గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలలో పనులు పూర్తి చేయించి, ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలని, ఇందుకు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ పోలు అర్చన, రవి, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని ఉన్నారు.

నర్సరీ పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

భీమారం: గ్రీన్‌ఫ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని హరితహారం కింద చేపట్టిన మొక్కల నర్సరీని ఎంపీడీవో శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం బృహత్ ప్రకృతివనంలోని మొక్కలకు ప్రతిరోజు నీరందించేలా చూడాలని కార్యదర్శికి సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి అండ..

బెల్లంపల్లి: పట్టణంలోని శాంతిఖని బస్తీకి చెందిన సుందరగిరి శ్రీనివాస్ (మంగలిషాపు నిర్వాహకుడు) గతనెల 26న గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య తిరుమల, కుమారుడు ఆదర్శ్, కూతురు అక్షిత ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన బాధిత కుటుంబానికి బస్తీవాసులు, స్నేహితులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. దాతలు అందజేసిన రూ.61,500 నగదును బెల్లంపల్లి పోస్టాఫీసులో తల్లీ కూతుళ్ల తిరుమల, అక్షిత పేరున శుక్రవారం ఫిక్స్‌డ్ చేసి పట్టా సర్టిఫికేట్‌ను అందజేశారు. ఆర్థిక తోడ్పాటునందించిన బస్తీ వాసులు, మిత్రులకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి'

మందమర్రిరూరల్: మందమర్రి శివారులోని బుర్దగూడెం సమీపంలోని 427 సర్వే నంబర్‌లోని పాఠశాలకు చెందిన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన స్థలంతోపాటు గ్రామకంఠం కోసం కేటాయించిన భూమిని అధికారులు కబ్జాకాకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1/70 చట్టం అమల్లో ఉన్న కొందరు రియల్ వ్యాపారులు భూకబ్జాలకు పాల్పడుతూ అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు జుమ్మిడి గోపాల్, సల్మాన్, జాగిరి రాజేష్, నితీష్ ఉన్నారు.

రెండోరోజూ కొనసాగిన ఆకలికేక దీక్ష

మందమర్రిరూరల్: ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న ఆకలికేక దీక్ష రెండోరోజూ శుక్రవారం కొనసాగింది. సంఘాల నాయకులు ఈ దీక్షకు సంఘీభావం ప్రకటించి వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, హెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెల్డి సుదర్శన్, టీజేఎఫ్ నాయకుడు దేవి సత్యం, బీజేపీ నాయకుడు నర్సింగ్ తదితరులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో కొండ చిలువ



కొండ చిలువను పట్టుకున్న రాజు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీ కాలనీలోకి భారీ కొండచిలువ వచ్చింది. పోచమ్మ ఆలయం వద్ద చెట్టుకు చుట్టుకుని ఉండడాన్ని గమనించిన స్థానికులు పాముల రాజుకు సమాచారం అందించారు. రాజు వచ్చి కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలేశాడు.

రాగిజావ, బెల్లం సరఫరాకు వాహనం ఏర్పాటు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం గతనెల నుంచి సత్యసాయి అన్నపూర్ణ సేవాట్రస్ట్, బెంగుళూర్ అందిస్తోంది. దీనిలో భాగంగా ఈనెల 5000 కిలోల రాగిపిండి, 3300 కిలోల బెల్లంపొడి ప్యాకెట్లు జిల్లా కేంద్రానికి వచ్చాయి. ఆయా మండల కేంద్రాలకు సరఫరా చేసేందుకు శుక్రవారం వెరబెల్లి ఫౌండేషన్ ట్రస్టు వాహనాన్ని సమకూర్చగా అన్ని పాఠశాలలకు పిండి, బెల్లంను సరఫరా చేశారు. మరో నాలుగు నెలలు మండలాలకు సరఫరా అయ్యే ఖర్చును ట్రస్టు చెల్లిస్తానని చైర్మన్ రఘునాథ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యసాయి అన్నపూర్ణ సేవా ట్రస్టు పోస్టర్‌ను డీఈవో వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, బాలు ఉన్నారు.

సమాచారం

8న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభ

శ్రీరాంపూర్: బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ స్టేడియంలో ఈనెల 8న సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) బెల్లంపల్లి రీజియన్ 10వ మహాసభ నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం తెలిపారు. శ్రీరాంపూర్‌లో సివిల్ కార్మికులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు బక్కయ్య, సోమయ్య, రమేశ్, రవి, రాజయ్య, ఐలయ్య, నాగరాజు, సుగుణ, కోమల పాల్గొన్నారు.

8న కార్మిక సంఘాల సదస్సు

శ్రీరాంపూర్: గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 8న సదస్సు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎమ్మెస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్టీయూసీ, ఎస్సీకేఎస్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘంల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని వివరించారు. ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, మేధావులు హాజరవుతారని తెలిపారు.

22న నేతకాని ఆత్మీయ సమ్మేళనం

దండేపల్లి: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలో ఈనెల 22న నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర నాయకుడు రాయమల్లు, మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార గోడ పోస్టర్లను దండేపల్లి నేతకాని సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. సమ్మేళన కార్యక్రమానికి నేతకాని కులబాంధవులు, సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘ నాయకులు సాయికుమార్, చంద్రయ్య, సోము, సాగర్, పోచన్న, సత్యం, మల్లేశ్ పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తిచేయాలి

- డీఆర్‌డీవో శేషాద్రి



సీసీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

దండేపల్లి: బ్యాంకు లింకేజీతో పాటు, శ్రీనిధి రుణ లక్ష్యాలు మార్చి నెలాఖరు వరకు పూర్తిచేయాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. దండేపల్లి ఐకేపీ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీసీలతో మాట్లాడారు. ఇప్పటివరకు చేసిన బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు రూ.46 కోట్లకుగాను ఇప్పటివరకు రూ.25 కోట్లు ఇప్పించినట్లు, శ్రీనిధిలో రూ.8 కోట్లకు రూ.4 కోట్లు ఇప్పించినట్లు సీసీలు తెలుపగా, మిగిలిన లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. రుణాలు ఇప్పించడంతోపాటు చెల్లింపులపై దృష్టిసారించాలన్నారు. సంఘాలను ఆర్థికాభివృద్ధిలో నడిపించాలన్నారు. సీసీలు, తిరుపతిగౌడ్, సురేందర్, లావణ్య, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాలు

మంచిర్యాలఅర్బన్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందుకు శుక్రవారం మంచిర్యాలలో వామపక్షవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్ రాసే అవకాశం కల్పించాలన్నారు. ప్రిలిమ్స్ ప్రాథమిక మల్టీపుల్ చాయిస్ పరీక్షలు తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు న్యాయస్థానం ఆదేశానుసారంగా మార్కులు కల్పించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుపతి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

జైపూర్: గ్రామాల్లో గల బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెన్నూర్ పాలక్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభ తెలిపారు. మండలంలోని టేకుమట్లలో శుక్రవారం 102 నుంచి 110 వరకు గల ఇందారం, రామారావుపేట, టేకుమట్ల బూత్ అధ్యక్ష కమిటీల శక్తికేంద్రాల సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్ సమావేశం ఉంటుందని దీనికి ప్రతి బూత్ కమిటీలోని 22మంది సభ్యులు హాజరు కావాలన్నారు. చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు విశ్వంభర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్, నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్ యాదవ్, సతీశ్, ఏనయ్య, మధుకర్, పోచన్న పాల్గొన్నారు.

స్కీంవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



బెల్లంపల్లి ఆర్డీవో డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెల్లంపల్లిలో స్కీం వర్కర్లు ప్రదర్శన, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఐకేపీ వీవోఏలు ఇతర రకాల స్కీం వర్కర్లు పురవీధుల్లో కదం తొక్కారు. అనంతరం డీఏఓకు వినతి పత్రం అందజేశారు. వక్తలు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లను కార్మికులుగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రైవేటీకరణను ఆపేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బానుమతి ,జిల్లా కార్యదర్శి రాజమణి పాల్గొన్నారు. తాండూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా తర్వాత తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు.

నెన్నెల: అంగన్‌వాడీ స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ భూమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

లక్సెట్టిపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందించారు. రంజిత్, శోభ, రాములు, శారద, అనిత, సత్యవతి, కళావతి, రత్న, గీత పాల్గొన్నారు.

జైపూర్: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కుమార్, మాధవ్‌రెడ్డి ఉన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని తహసీల్దార్లు పరమేశ్వర్, రాంచందర్‌కు సీఐటీయూ నాయకులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని బైక్ ర్యాలీ, ధర్నా



డీఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి: భీమిని మండలం చిన్నగుడిపేట్ గ్రామానికి రోడ్డు నిర్మించి, రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ముందుగా బైక్ ర్యాలీని బీజేపీ జిల్లా నాయకుడు కొయ్యల ఏమాజీ, పాల్వాయి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించగా చిన్నగుడిపేట్ నుంచి గ్రామాల మీదుగా ఆర్డీవో ఆఫీస్ వరకు నిర్వహించి ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ చిన్నగుడిపేట్, పెద్దగుడిపేట్ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. వడాల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు అధికారులను, ప్రజాప్రతినిధులు కోరినా పట్టించుకోలేదన్నారు. రోడ్డు సదుపాయం కల్పించని బెల్లంపల్లి, సిర్పూర్ (టి) ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, కోనేరు కోనప్ప తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని లేకపోతే కలెక్టరేట్ ఎదుట ఆమరణ దీక్ష చేపడుతామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం డీఏవోకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, భీమిని బీజేపీ మండల అధ్యక్షుడు భీమయ్య, నాయకులు లింగమూర్తి, ఉపసర్పంచ్ బుచ్చయ్య, శ్రీనివాస్, రాజులాల్ యాదవ్, ప్రకాశ్, నవీన్, తిరుపతి, రంగు సాయి, రెడ్డి స్వామి పాల్గొన్నారు.

పాఠశాలలో పరిశుభ్రత పాటించాలి

లక్సెట్టిపేట: పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. మన ఊరు–మన బడిలో భాగంగా చందారం గ్రామంలో పాఠశాలతో పాటు తరగతి గదులను శుక్రవారం పరిశీలించారు. ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఏపీవో వెంకటరమణ, పీఆర్ఎఈ శృతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చెన్నూర్: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంఈవో రాధాకృష్ణమూర్తికి కార్మికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులు కరీంబీ, కమల, ఎస్.గట్టక్క, సమ్మక్క, రవి, చందు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు జన్మభూమినగర్‌లో సీఎస్ఆర్ నిధులతో ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం రోడ్డు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, వార్డు కౌన్సిలర్ చైతన్య, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, అత్తి సరోజ, తోట తిరుపతి, సత్యపాల్‌రెడ్డి, షఫి, అంజన్న, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వార్డులో ఎమ్మెల్యే పర్యటన

జిల్లా కేంద్రంలోని 24 వార్డులో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం పర్యటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ వార్డులోని సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, మాజీ కౌన్సిలర్ కారుకూరి చంద్రమౌళి, మద్దుల మనోహర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికే 'తొలిమెట్టు'



ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈవో పోచయ్య

నస్పూర్: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికే ప్రభుత్వం తొలిమెట్టు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పోచయ్య తెలిపారు. పట్టణంలోని నస్పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం మండల స్థా యి బోధనాభ్యసన సామగ్రి మేళా 'తొలిమెట్టు' ని ర్వహించారు. 13 పాఠశాలల నుంచి 71 ప్రదర్శనలు చేయగా, వాటిని ఎంఈవో తిలకించారు. హెచ్ఎం సుధారాణి, రిసోర్స్ పర్సన్స్ మల్లికార్జున్, మహేశ్వర్, రవి, శంకర్, రాజన్న, కమల, ప్రేమ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'గడప గడపకూ బీజేపీ' ద్వారా పార్టీ నాయకులు కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శక్తి కేంద్రం బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బూత్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కళ్లంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. శనివారం బెల్లంపల్లిలో జరగనున్న బూత్ స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేశ్, ఉపాధ్యక్షులు మధుకర్, రమేశ్, నాయకులు సంతోష్, కొండ రవి వెంకటేశ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రీడాసామగ్రి పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, క్రీడా దుస్తులు, షూస్, బెల్ట్‌లను జెడ్పీవైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, ఎంపీపీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. అంతర్జాతీయ స్థాయి చెస్ క్రీడలో రాణించిన విద్యార్థి ఆకాష్‌ను అభినందించారు. కౌన్సిలర్ షేక్ ఆస్మా బేగం పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన క్రీడాకారులకు దేవాపూర్ ఎస్సై విజయేందర్ శుక్రవారం క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా వీటిని అందించినట్లు తెలిపారు. ఏఎస్సై బాలకిషన్ పాల్గొన్నారు.

బడి బయట చిన్నారుల గుర్తింపుపై సర్వే

కాసిపేట: చింతగూడ, మద్దిమాడలో బడిబయట చిన్నారుల గుర్తింపుపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మద్దిమాడ గ్రామస్తులు 15 నుంచి 19 వయస్సు కలిగిన డ్రాపౌట్ విద్యార్థులు ఇద్దరిని గుర్తించారు. 6 నుంచి 14, 15 నుంచి 19 వయస్సు కలిగిన వారిని వేర్వేరుగా సర్వే చేసి బడి బయట వారిని గుర్తించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సీఆర్పీ రమేశ్, ఉపాధ్యాయులు రాజయ్య ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కోటపల్లి: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ సూచించారు. అన్నారం గ్రామానికి చెందిన కుంభం రాకేశ్‌రెడ్డి స్మారకార్థం శుక్రవారం నిర్వహించిన కోటపల్లి, వేమనపల్లి మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ ప్రారంభించారు. సర్పంచ్ రమేశ్, ఎస్సై వెంకట్, నాయకులు ఆబుఖాన్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దండేపల్లి: తాళ్లపేటకు చెందిన మాడ అమృతకు రూ.42 వేలు, సత్తవ్వకు రూ.27 వేలు, కళవ్వకు రూ.13 వేలు, ఎర్రం రాజమ్మకు రూ.10 వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచులు కళావతి, లచ్చుపటేల్, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు దయాకర్, సుంగు, మహేందర్, గౌరవయ్య, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

దళితశక్తి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

రామకృష్ణాపూర్: దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాజ్యస్థాపన కోసం డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ ఇచ్చిన కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు సేకరించారు. రాజు, ఆగయ్య, చందర్, శ్రీను ఉన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

భీమారం: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో కుంకుమ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ప్రవీణాచార్యులు అండాల్‌దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు పూజలో పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

జన్నారం: సమస్య వచ్చిందని కూర్చోకుండా మన ముందు చిన్నదైనప్పుడు ఏదైన సాధించగలమని ప్రముఖ మోటివేషన్ ట్రైనర్ వేణుకళ్యాణ్ అన్నారు. మండల కేంద్రంలోని పైడిపెల్లి ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 15 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు స్లేట్ హైస్కూల్ సౌజన్యంతో శుక్రవారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. వేణుకళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పిల్లలపై పెట్టుకున్న తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. స్లేట్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



రోడ్డుకు అడ్డంగా నిలిపిన ఎరువుల లారీ

నెన్నెల: మండల కేంద్రంలోని రహదారులపై వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. నడిరోడ్డుపై సిమెంట్, ఎరువులు, రేషన్ బియ్యం లారీలను నిలుపుతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. వ్యాపార గోదాంలను ఊరి శివారులో ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నారు. స్కూల్‌కు వెళ్లే వాహనాలకు రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలిపివేయడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.